AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

మినీ ట్యాంక్‌బండ్‌కు మోక్షమెప్పుడో..! 2






భర్తను చంపిన భార్య అరెస్ట్ 2



## ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష..

హైదరాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. – అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ



## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 128 ఫిర్యాదులు అందాయి. ఎండలు మండుతున్నా ఫిర్యాదులు సమర్పించేందుకు ప్రజలు తరలివచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్నకు, డీపీవో శ్రీనివాస్ రావు, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

### రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్వీ నాయకులు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. అనంతరం బీఆర్ఎస్వీ నగర కార్యదర్శి మధుకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఇప్పటికైనా గాఢనిద్ర నుంచి బయటకు వచ్చి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరారు.

## మహిళలు, బాలికలు తమ హక్కులపై అవగాహన ఉండాలి




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** మహిళలు, బాలికలు తమ హక్కులపై అవగాహన ఉండాలని భరోసా సెంటర్ ఎస్సై పుష్పావతి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా భరోసా సెంటర్ ఆధ్వర్యంలో చైల్డ్ సేఫ్టీ కార్యక్రమాన్ని బోర్గాం(పి) పంచాయతీ పరిధిలో, డీఆర్‌డీఏ ఐకేపీ మండల సమాఖ్యలో నిర్వహించారు. సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో బోర్గాం(పి) కార్పొరేటర్ నరేష్ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల భద్రత, బాలల రక్షణ, లింగ సమానత్వం, జెండర్ బయాస్, సైబర్ నేరాల నివారణ, బాల్య వివాహాల నిర్మూలన, భరోసా సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని, పితృస్వామ్య భావనలు, జెండర్ వివక్షను గుర్తించి ఎదుర్కోవాలని సూచించారు. సైబర్ మోసాలపై జాగ్రత్తలు తీసుకోవాలని, బాల్యవివాహాల నివారణలో ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శారద, కోఆర్డినేటర్ రోజా, సపోర్ట్ పర్సన్ సవిత, ఏఎన్ఎం మమత, ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ఇంటి నుంచే ‘జన గణన’

దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలక ప్రక్రియ 'జన గణన' (సెన్సస్) సరికొత్తగా ప్రారంభమైంది. మునుపటిలా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చేవరకు వేచి చూడాల్సిన అవసరం లేకుండా, పౌరులే స్వయంగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే 'డిజిటల్ స్వీయ గణన' విధానానికి ప్రభుత్వం అవకాశం కల్పిం చింది. జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వయంగా తన వివరాలను నమోదు చేసుకుని ఈ ప్రక్రియను ప్రారంభించారు.

- అక్షరటుడే, భీమ్‌గల్




- స్వయంగా వివరాలు నమోదు చేసుకునే అవకాశం
- జిల్లాలో ప్రారంభమైన స్వీయ నమోదు ప్రక్రియ
- మే 10 వరకు వెబ్‌సైట్, యాప్‌లో అవకాశం
- వివరాలు నమోదు చేసుకున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

సాధారణంగా జనగణన అంటే ప్రభుత్వ సిబ్బంది ఇంటికి వచ్చి ప్రశ్నలు అడుగుతారు. వాటికి ప్రజలు చెప్పే సమాధానాలను రాసుకుంటున్నారు. అనంతరం దానిని ప్రభుత్వానికి నివేదిస్తారు. ప్రస్తుతం ప్రభుత్వం కొత్తగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో ప్రజలు స్వయంగా జన గణనలో పాల్గొనవచ్చు. దీనికోసం ప్రభుత్వం వెబ్ పోర్టల్, యాప్‌ను తీసుకొచ్చింది. 15 నిమిషాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. ప్రభుత్వ సిబ్బంది వివరాలు నమోదు చేసే సమయంలో తప్పులు దొర్లే అవకాశం ఉంది. అయితే స్వయంగా జనగణనలో పాల్గొంటే మన వివరాలు మనం పక్కాగా నమోదు చేసుకోవచ్చు.

### ఎలా చేయాలంటే..

- https://se.census.gov.in పోర్టల్‌లోకి వెళ్లాలి.
- కుటుంబ సభ్యుల సంఖ్య, విద్య, వృత్తి, గృహ వసతులు వంటి వివరాలను నమోదు చేయాలి.
- నమోదు పూర్తయ్యాక ఒక 'సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడీ' (SEID) వస్తుంది.
- మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు మీ ఇంటికి వచ్చినప్పుడు, కేవలం ఆ ఐడీ నంబర్ చూపిస్తే సరిపోతుంది. మళ్లీ అన్ని వివరాలు చెప్పాల్సిన అవసరం ఉండదు.

### జిల్లా జనాభా

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం సుమారు 25.5 లక్షలు మంది ప్రజలు ఉన్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం జిల్లా జనాభా గణనీయంగా పెరిగింది. 2011లో జిల్లా అక్షరాస్యత 61.25% ఉండగా, ప్రస్తుతం అది 70శాతం దాటినట్లు అంచనా. జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు, ఇతర నగరాలకు వలస వెళ్లే వారు ఎక్కువ. ఇలాంటి వారు తాము ఎక్కడ ఉన్నా ఆన్‌లైన్ ద్వారా స్వీయ నమోదు చేసుకునే వెసులుబాటు ఈసారి కలగడం విశేషం.

### ఎందుకు ముఖ్యం?

కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, విద్యా సంస్థల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన వంటివన్నీ ఈ జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతాయి. సరైన వివరాలు ఇస్తేనే జిల్లాకు రావాల్సిన నిధులు, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయి. డిజిటల్ స్వీయ గణన అనేది పారదర్శకమైన విధానం. ఉద్యోగులు, విద్యార్థులు, వలస వెళ్లిన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. మీ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంటాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ నెల 26 నుంచి మే 10 లోపు ఆన్‌లైన్ ద్వారా స్వయంగా జనగణనలో పాల్గొనవచ్చని తెలిపారు.



## కామారెడ్డిలో పెట్రోల్ బంక్‌లు బంద్..

**అక్షరటుడే, కామారెడ్డి:** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదు. రాష్ట్రంలో కూడా ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత ఉన్నట్టుగా ప్రచారం కూడా కాలేదు. అయితే అనూహ్యంగా సోమవారం కామారెడ్డి పట్టణంలో పెట్రోల్ కొరత తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. పట్టణంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొరత లేకుండా కొనసాగిన పెట్రోల్ బంకులు సాయంత్రం నో స్టాక్ పెట్టారు. దాంతో వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం కామారెడ్డి పట్టణం మొత్తం చక్కర్లు కొట్టారు. నిజాంసాగర్ చౌరస్తాలో ఉన్న ఒకే ఒక్క పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ డీజిల్ ఉండడంతో వాహనదారులు క్యూ కట్టారు. పెట్రోల్ కొరతకు కారణాలను బంక్ సిబ్బందిని ఆరా తీయగా బ్యాంకులకు సెలవు ఉండటంతో పెట్రోల్, డీజిల్ కోసం డీడీలు చెల్లించలేదని తెలిసింది.



## న్యాల్‌కల్‌లో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

**అక్షరటుడే, ఇందూరు:** మోపాల్ మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ సివిల్ ఇంజినీర్ కొమ్మిరెడ్డి స్వామి, సర్పంచ్ చంద్రకళ గంగాప్రసాద్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కొమ్మిరెడ్డి స్వామి మాట్లాడుతూ.. రూ.2.26 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కన్స్ట్రక్షన్ డీఈ వెంకటరమణ, కన్స్ట్రక్షన్ ఏడీఈ తోట రాజశేఖర్, సివిల్ ఏఈ కార్తీక్, ఉప సర్పంచ్ సతీష్ రావు, కాంట్రాక్టర్ నరేష్ రెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలి: ధన్‌పాల్



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ఇందూరులో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూం ఇళ్లపై హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్‌లో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఉమ్మడి జిల్లా సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సమీక్షలో పాల్గొని నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. ప్రధానంగా నాగారంతో పాటు కొత్త కలెక్టరేట్ వద్ద ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. ఇప్పటికే పూర్తయిన ఇళ్లకు మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గతంలో పలు వస్తువులు చోరీ కావడంతో.. ఇళ్లకు మరమ్మతులు చేసినప్పటికీ లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో మళ్లీ అదే దుస్థితి నెలకొందన్నారు. అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఒక ఇల్లు కూడా కేటాయించలేదని, అర్హులైన పేదలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారన్నారు. అర్బన్ నియోజకవర్గంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను మే 10వ తేదీ లోపు కేటాయిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. అలాగే నాగారంలోని బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్న వాటిని కూడా అతి త్వరలో పూర్తి చేసి అందజేస్తామని హామీ ఇచ్చారు. సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, హౌసింగ్ పీడీ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ పార్కింగ్‌లో మంటలు..



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి కలెక్టరేట్‌లో వాహనాలకు రక్షణ లేకుండా పోతోంది. సరైన పార్కింగ్ లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టరేట్‌కు వచ్చే ఉద్యోగులు, సాధారణ ప్రజల వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలం ఉన్నా రక్షణ లేకుండా పోతుంది. ఐదు నిమిషాలు కూడా ఎండలో నిలబడ లేని పరిస్థితుల్లో ఓపెన్ పార్కింగ్ స్థలంలో వాహనాలను నిలపాలంటే భయ పడుతున్నారు. ద్విచక్రవాహనాలు అక్కడక్కడా చెట్లకింద పార్కింగ్ చేస్తున్నా కార్ల పార్కింగ్ సమస్యగా మారింది. ఎండలోనే కార్లను పార్కింగ్ చేయాల్సిన దుస్థితి నెలకొంది. సోమవారం కలెక్టర్ కార్యాలయం పార్కింగ్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దాంతో కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు, ఉద్యోగులు కాసేపు ఏం జరుగుతుందో అర్థం కాక ఆందోళనకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించగా ఫైర్ ఇంజన్‌తో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. సకాలంలో స్పందించకపోయి ఉంటే ప్రమాదం సంభవించేదని ప్రజలు చెబుతున్నారు. మంటలు దట్టంగా వ్యాపించి ఉంటే పక్కనే ఉన్న కార్లు మంటల్లో కాలిపోయేవి. అప్రమత్తమైన కలెక్టరేట్ సిబ్బంది ఉద్యోగులకు చెప్పడంతో కార్లను అక్కడినుంచి తీసివేశారు. వెనకాల కార్ల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేశారు. అయితే అక్కడ పైన షెడ్ లాంటిది ఏమి లేకపోవడంతో చెట్టుకింద నీడ చూసి అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పార్కింగ్ కోసం ప్రత్యేకంగా షెడ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

లింగంపేటలో..



మాక్లూర్‌లో..



నందిపేటలో..




## ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం..

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలను ఎగురవేశారు. తెలంగాణ ఉద్యమంలో బీఆర్ఎస్ పోశించిన పాత్ర.. రాష్ట్ర సాధనకు చేసిన కృషిని గుర్తు చేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



పెద్దకొడప్‌గల్ మండలంలో..



పోచంపాడ్‌లో..



పోల్కంపేటలో..



షెట్పల్లిలో..



వేంపల్లిలో..



ఎల్లారెడ్డిలో..

# మినీ ట్యాంక్‌బండ్‌కు మోక్షమెప్పుడో..?

■ రూ.కోట్ల ప్రజాధనం వృథా.. ■ పెర్కిట్ ప్రజలకు కలగా మారిన వైనం..
■ హౌసింగ్ బోర్డ్ పార్క్‌ను సైతం పట్టించుకోని అధికారులు..



**ఆర్మూర్ పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైంది. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రజలకు మినీ ట్యాంక్‌బండ్ కలగానే మిగిలింది. చిన్నారులు సరదాగా ఆడుకునేందుకు.. సాయంత్రం వేళ చల్లటి వాతావరణంలో సేదదీరాలనుకునే వారికి నిరాశే మిగులుతోంది. రోజురోజుకు పట్టణం విస్తరిస్తున్నప్పటికీ ప్రజలకు తగినన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంలో మున్సిపాలిటీ విఫలమవుతుందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.**

**– అక్షరటుడే,ఆర్మూర్**

టీయూఎఫ్ఐడీసీ నుంచి 2023 అక్టోబర్‌లో రూ.2 కోట్ల నిధులతో పెర్కిట్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. వాకింగ్ ట్రాక్‌ను నిర్మించి చెరువు కట్టపై ఒకవైపు ఇనుప ప్రహరీని నిర్మించారు. రోడ్డు పొడవున వీధిదీపాల కోసం స్తంభాలను ఏర్పాటు చేశారు. కాగా పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రస్తుతం మినీ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటుచేసిన వాకింగ్ ట్రాక్ శిథిలావస్థకు చేరింది. విద్యుత్ స్తంభాల వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. మరోవైపు చెరువు కట్ట ప్రాంగణమంతా పిచ్చి మొక్కలు ముళ్లపొదలతో నిండిపోయింది.

### అధ్వాన్నంగా హౌసింగ్ బోర్డు పార్కు..

పట్టణంలో జనాభా 80 వేల వరకు ఉంటుంది. 36 వార్డులతో పట్టణం విస్తరించింది. అయితే రూ.కోట్లలో ఖర్చుచేసి ఏర్పాటు చేసిన హౌసింగ్ బోర్డు పార్క్‌లో పిల్లలు ఆడుకునే పరిస్థితి లేకుండా పోయింది. పార్క్‌లో ఏర్పాటు చేసిన ఊయలలు, జారుడుబండలు విరిగిపోయి అధ్వానంగా మారాయి. కాగా పట్టణంలో నీటి సరాఫరా కోసం హౌసింగ్ బోర్డు పార్కులో భారీ నీటి ట్యాంకులు నిర్మాణం కోసం గతంలో పనులు చేపట్టగా పిల్లల ఆట వస్తువులను తొలగించి పక్కన పడేశారు. కాగా.. కాలనీవాసులు ఆందోళనకు దిగడంతో వాటర్ ట్యాంకుల నిర్మాణం నిలిపివేశారు. కానీ పిల్లల ఆట వస్తువులను తిరిగి ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

### మొక్కల ఆలనపాలన చూసేవారేరి..?

పార్కులో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన మొక్కలు నిర్వహణ లేక ఎండిపోతున్నాయి. పార్కులో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పార్కుని ఆనుకొని ఏర్పాటుచేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. దీంతో పార్కుకు వచ్చిన మహిళలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. మరోవైపు పార్కు చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప కంచెను పోకిరీలు తొలగించి రాత్రివేళ మద్యం సిట్టింగులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు శ్రద్ధ వహించి అటు మినీ ట్యాంక్ బండ్‌ను, ఇటు హౌసింగ్ బోర్డ్ పార్క్‌ను బాగుపర్చాలని.. ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని పట్టణ ప్రజల కోరుతున్నారు.





### పార్క్‌ను అభివృద్ధి చేయాలి...




రూ.కోట్లు పెట్టి హౌసింగ్ బోర్డులో నిర్మించిన పార్కు అధికారుల పర్యవేక్షణ లోపంతో అధ్వానంగా మారింది. పార్కులోని ఆట వస్తువులు చెడిపోయి తుప్పు పడుతున్నాయి. మరోవైపు జిమ్‌లో పరికరాలు శిథిలమై పోయాయి. పెర్కిట్ చెరువు కట్టపై మినీ ట్యాంక్ బండ్ పనులను తిరిగి నిధుల కేటాయించి పనులను పూర్తి చేయాలి. ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

**–పూజా నరేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆర్మూర్**



## 11/33 కేవీ విద్యుత్ లైన్ మార్చాలి

**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్ :** పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని నూతన ప్లాట్లలో గల 11/33 కేవీ విద్యుత్ లైన్‌ను మార్చి కాలనీవాసుల ప్రాణాలు కాపాడాలని బీజేపీ మండల నాయకుడు తానాజీ రావు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఉన్న ఈ హెవీ విద్యుత్ లైన్ సుమారు పది ఇళ్ల పైనుంచి వెళ్తోందన్నారు. ఇప్పటికే ఆర్నెళ్లలో మూడుచోట్ల లైన్ తెగిపోయి ఇబ్బందులు పడ్డామన్నారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. ఆర్నెళ్ల క్రితం విద్యుత్ లైన్ తెగిన రోజు మండల కేంద్రంలో ప్రజలు రోడ్డుపై ధర్నా చేయగా విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని త్వరలోనే విద్యుత్‌లైన్ మారుస్తామని మాట ఇచ్చారన్నారు. అప్పుడు ధర్నా విరమించామని.. కానీ ఇప్పటివరకు కూడా సమస్య పరిష్కారం కాలేదన్నారు. సంఘటన జరిగి ప్రాణాలు కోల్పోతే తప్పా విద్యుత్ అధికారులు స్పందించే అవకాశం లేనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందారు. మరో ఇంటిపై విద్యుత్ లైన్ తెగే అవకాశం ఉండడంతో ఈనెల 18న కాలనీవాసులు స్థానిక విద్యుత్ అధికారులకు తెలియజేయడంతో మరమ్మతులు చేశారన్నారు. మరో నెల రోజులు అయితే వర్షాకాలం వస్తుందని.. బలమైన గాలులు వీచే అవకాశం ఉండడంతో.. సమస్య తీవ్రం కాకముందే వెంటనే లైన్‌ను మార్చాలని వారు డిమాండ్ చేశారు.

## మైనర్లకు పొగాకు వస్తువుల విక్రయం నేరం..



**అక్షరటుడే, ఆర్మూర్:** మైనర్లకు పొగాకు వస్తువుల విక్రయించడం నేరమని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో 'నో టొబాకో సేల్స్ టు మైనర్' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కళాశాలలు, స్కూళ్లు, ఆట స్థలాల సమీపంలో ఉన్న కిరాణా షాప్‌లు, పాన్ షాప్‌లలో నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్లకు సిగరెట్లు, పాన్ మసాలాలు అమ్మడం నేరమని పోస్టర్లను అతికించి అవగాహన కల్పించారు. స్కూళ్ల సమీపంలో ఉన్న ఆవరణలో ఉన్న పాన్‌షాప్‌లను తొలగించాలని.. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌వో సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముప్కాల్‌లో మేడే వాల్ పోస్టర్ల ఆవిష్కరణ




**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రంలోని సీజే బీడీ కంపెనీలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయూజీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. ముత్తన్న మాట్లాడుతూ 1886లో అమెరికాలోని చికాగోలో కార్మికుల హక్కుల కోసం జరిగిన పోరాటాన్ని గుర్తు చేశారు. కార్మికుల రక్తంతో ఏర్పడిన ఎర్రజెండా ఆధ్వర్యంలో అనేక హక్కులు సాధించుకున్నామని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. వాటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండీ నజీర్, నిమ్మల నిఖిల్, రాజేశ్వర్, సునీల్, జ్ఞానేశ్వర్, ప్రకాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## పీఎంపీ, ఆర్ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా మహిళా కార్యవర్గం



**అక్షరటుడే, లింగంపేట:** కామారెడ్డి జిల్లా పీఎంపీ, ఆర్ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా మహిళా విభాగం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆర్ఎంఈ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నిజ్జన విఠల్ వివరాలు వెల్లడించారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా సూర సునీత, ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ రుక్మిణి, గౌరవాధ్యక్షురాలిగా చామరం విమల, ఉపాధ్యక్షురాలిగా వడ్ల సుజాత, జాయింట్ సెక్రెటరీగా మాలోత్ అమినా తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాలరావు, గౌరవాధ్యక్షుడు గంగాధర్, అంజిరెడ్డి, బుచ్చిరెడ్డి, అధికార ప్రతినిధి డాక్టర్ భీమ్‌రాజ్, వైస్ ప్రెసిడెంట్లు సాయిలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో పులిహోర వితరణ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమానికి తరలివచ్చే వారి కోసం పులిహోర వితరణకు శ్రీకారం చుట్టారు. సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. వేసవి ఎండలు తీవ్రరూపం దాలుస్తున్న నేపథ్యంలో.. ప్రజావాణికి ప్రతి సోమవారం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం పులిహోర పంపిణీ కార్యక్రమం చేపట్టామని ఫోరం సభ్యులు తెలిపారు. ప్రతి సోమవారం దీనిని కొనసాగిస్తామని ప్రతినిధులు తెలిపారు. కాగా.. రాజస్థానీ వాకర్స్ గ్రూప్ సహకారంతో తాగునీటిని సమకూర్చారు. ఫోరం ప్రతినిధులను, వాకర్స్ గ్రూప్ బాధ్యులను అదనపు కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, సీనియర్ సిటిజన్స్ ఫోరం, వాకర్స్ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## బంజపల్లిలో ఘనంగా కుస్తీ పోటీలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నిజాంసాగర్ మండల కేంద్రంలోని బంజపల్లిలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మందిరంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏలే సుగుణమ్మ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ హాజరై పోటీలను ప్రారంభించారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ తరహా కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామ యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. గ్రామ ప్రజలు, నాయకులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## గర్భిణులకు వైద్య పరీక్షలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి 32 మంది గర్భిణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది వారికి బీపీ, హిమోగ్లోబిన్, ఆర్‌బీఎస్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి క్యాల్షియం, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను పంపిణీ చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ టాబ్లెట్లను డబుల్ డోస్‌గా వాడాలని సూచించారు. గర్భిణులు ప్రతినెలా 3వ నెల, 5వ నెలల్లో తప్పనిసరిగా ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలని చెప్పారు.

## తెయూలో ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సీట్లను పెంచాలి




**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సీట్లను పెంచాలని తెయూ ఏబీవీపీ విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రిజిస్ట్రార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇందూర్ జిల్లా కన్వీనర్ అక్షయ్ మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఇంటిగ్రేటెడ్ కోర్సుల ప్రవేశాల్లో సీట్లను 30 నుంచి 60కి పెంచాల్నారు. సీట్లు పెంచి ప్రతిభావంతులైన విద్యార్థులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ ప్రతిపాదనను అకడమిక్ కౌన్సిల్‌లో ఆమోదించి, వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని, పెరిగిన సీట్లతో కూడా నాణ్యతా ప్రమాణాలకు లోటు రాకుండా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కార్యదర్శి సమీర్, సంయుక్త కార్యదర్శి అనిల్, కార్యకర్తలు మహేష్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## గోవును జాతీయ గోమాతగా ప్రకటించాలి




**అక్షరటుడే, లింగంపేట:** భారతీయ సంస్కృతి హిందూ ధర్మంలో గోమాతకు మొదటి స్థానం ఇచ్చారని బీజేపీ నాయకులు అన్నారు. గోవును జాతీయ గోమాతగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. లింగంపేట రామాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ దేశంలో మెజారిటీ ఉన్నటువంటి హిందువుల ఆరాధ్య దేవంగా భావించే గోవును వధించడాన్ని నేరంగా పరిగణించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కౌడ రవి, కొత్త దుర్గయ్య, బొల్లారం క్రాంతి కుమార్, దత్తు రాములు, పెద్ది శివయ్య, అంద్యాల ఉదేష్, బొల్లు శ్రీకాంత్, దురిశెట్టి అశోక్, బొల్లు గణేష్, బర్ల చందు, కౌడా శ్రీనివాస్, ప్రసాద్ గౌడ్, చింతల వేణు, పారిపల్లి సంతోష్, గుండా బాలకిషన్, తిరుమల నరేష్ భగవాన్, రాజారామ్ రమేష్, కొత్త సంతోష్, మధునాల రాజు, సతీష్, పార్శీ ప్రభాకర్, చింతల సతీష్, పవన్, టైలర్ లక్ష్మీనారాయణ, చింతల రమేష్, గుజ్జరి వాసరి, ప్రవీణ్ సెట్, జక్సాని రవి, చింతల సంతోష్, పారిపల్లి సతీష్, పవన్ సెట్, సతీష్ సెట్ గో సంరక్షణ కార్యకర్తలు గ్రామస్థులు హిందూ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

### కమ్మర్‌పల్లి తహశీల్దార్‌కు వినతి..



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** ఆవును జాతీయ గోమాతగా గుర్తించాలని హిందూ ధర్మ పరిరోణ సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోవును అత్యంత పవిత్రంగా హిందువులు పూజిస్తారన్నారు. అలాంటి గోవును వధించడాన్ని నిషేధించాలని కోరారు. అలాగే తమ వినతిపత్రాలను రాష్ట్రపతి, పీఎం, గవర్నర్‌కు చేరవేయాలని తహశీల్దార్‌కు విన్నవించారు. కార్యక్రమంలో రమణయ్య, రాజశేఖర్, నాగభూషణం, రామస్వామి, నరేందర్ డిష్, గంగాధర్, ప్రవీణ్, రవీందర్, గణేష్ గుప్తా, భూపతి, శంకర్, అజయ్, రఘు, నవీన్, రాజ్ కుమార్, మగ్గిడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.